క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: మండల పరిధిలోని మాజేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చల్లపల్లి శాఖ డీఈ పులి శివనాగేశ్వరరావు బుధవారం తెలిపారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



మచిలీపట్నంటౌన్: మండల పరిధిలోని మంగినపూడి గ్రామంలోని వాకాలమ్మ అమ్మ వారి ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మెండు భానుమూర్తిని సభ్యులు ఆలయ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయం వద్ద దేవదాయ శాఖ మచిలీపట్నం డివిజన్ పర్యవేక్షణాధికారి కగ్గా శ్రీనివాసరావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈవో కృష్ణారావు పర్యవేక్షించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెడన: నిరుపేదలకు బుధవారం పట్టణానికి చెందిన సుఖీభవ ఫౌండేషన్ అధ్యక్షుడు అద్దంకి శంకర్ నిత్యావసర సరుకులను అందజేశారు. ఆర్థిక పరిస్థితి సరిగాలేక ఇటీవల వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులకు, ఒంటరి మహిళలకు ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున 20 కుటుంబాలకు అందజేశారు. ఫౌండేషన్ సభ్యు లు పటమట సాగర్, పెడన ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక నగదు అందజేత



తలగడదీవి(నాగాయలంక): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గణపేశ్వరంలోని కెనరాబ్యాంకు అధికారులు బుధవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్.ఎం బండ్రెడ్డి శివరామప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ టీజే ఫణికుమార్ చేతులమీదుగా 5,6,7 తరగతులు చదువుతున్న ముగ్గురికి రూ.3 వేల చొప్పున, 8,9,10 తరగతుల విద్యార్థులు మరో ముగ్గురికి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ వర్రె శ్రీమన్నారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వర్రె రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.మోహన్‌లాల్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ



కృత్తివెన్ను: దసరా ఉత్సవాలకు సంబంధించిన పనులను పసుపుకొట్టే కార్యక్రమంతో ప్రారంభించారు. నీలిపూడిలో కొలువై ఉన్న శ్రీ కనక దుర్గమ్మవారి ఆలయం వద్ద బుధవారం గ్రామంలోని ముత్తయిదువులు ముందుగా 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. పూజలు జరిపి దసరా ఉత్సవాల పనుల ప్రారంభానికి ముందుగా పసుపుకొట్టి ఉత్సవాలకు అంకురార్పణ చేశా రు.ప్రతి ఏటా ఉత్సవాలకు ముందుగా అమ్మ వారిని జలంతో అభిషేకించి మహిళలు పసుపుకొట్టి పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పుప్పాల రామాంజనేయులు (బుజ్జి) తెలిపారు.

తాగునీటి పనులపై చర్చ



ఘంటసాల: మండలంలోని తాగునీటి సమస్యలను పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యపై, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులపై డీఈఈ ప్రసన్నతో ఎంపీడీవో సుబ్బారావు బుధవారం చర్చించారు. ఆయా పనులను సకాలంలో పూర్తి చేయడానికి సహకరించాలని ఎంపీడీవో కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి మండలానికి వచ్చిన ప్రసన్నను మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుగుణ కుమారితో కలసి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస చంద్ పాల్గొన్నారు.

కూలితేనే కనికరిస్తారా?

- శిథిలావస్థకు చేరిన రక్షిత తాగునీటి పథకం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

గూడూరు: తుప్పుపట్టి బయట పడిన ఇనుప చువ్వలు.. ఊడిపడుతున్న పెచ్చులు.. ఓవర్ హెడ్ ట్యాంకుపై పెరిగిన పిచ్చిచెట్లు. ఫలితంగా ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో కప్పలదొడ్డి రక్షిత నీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు ఉంది. దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించిన రక్షిత నీటి పథకం శిథిలావస్థకు చేరింది.

1989లో మంజూరు..1993లో నిర్మాణం పూర్తి

1989లో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత నీటి పథకాన్ని మంజూరు చేయగా 1993లో నిర్మాణ పనులు పూర్తి చేసి పథకాన్ని ప్రారంభించారు. తొలినాళ్లలో సమీపంలోని చెరువు ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా చేసినప్పటికీ, వేసవిలో చెరువులో నీరు అడుగంటి పోతుండటంతో బోర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. ప్రస్తుతం గ్రామంలో దాదాపు 3,500 మంది జనాభా ఉండగా 450 వీధి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం జనాభా పెరగటంతో ఓవర్ హెడ్ ట్యాంకు సామర్థ్యం చాలక నాలుగు విడతల్లో నీరు సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.35 లక్షలతో పైప్‌లైన్ ఆధునికీకరణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా జల్ జీవన్ మిషన్ అమలుకు గ్రామం ఎంపికైంది. తొలిదశలో రూ.35 లక్షలు మంజూరవగా గ్రామంలో దెబ్బతిన్న పైప్‌లైన్ మొత్తాన్ని ఆధునికీకరించారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో వీధి కుళాయిలు లేని వీధులలో కూడా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి ఇళ్లకు కుళాయిలు ఇచ్చేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వం మారడంతో..

అయితే ప్రభుత్వం మారడంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, పంప్‌హౌస్, సంప్ నిర్మాణాలకు రావాల్సిన నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఇబ్బందులు మొదలయ్యాయి.



కప్పలదొడ్డిలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు

రూ.90 లక్షలతో అంచనాలు..

శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు స్థానంలో ఎక్కువ సామర్థ్యంతో కొత్త ట్యాంకు, పంప్‌హౌస్, సంప్ నిర్మాణం చేపట్టాలని గ్రామ సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతిలు పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో రూ.90 లక్షలతో 1.5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు, పంప్‌హౌస్, సంప్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు.

మైక్రో ఫిల్టర్ ఏర్పాటులో జాప్యం

దీనికితోడు గ్రామంలో తాగునీటిని శుద్ధి చేయడానికి రూ.13 లక్షల ఎంపీ నిధులు మంజూరయ్యాయి. రెండేళ్లుగా నిధులు మూలుగుతున్నాయి. పంచాయతీ పాలక వర్గం మైక్రో ఫిల్టర్ నిర్మాణం నిమిత్తం రక్షిత నీటి పథకానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని కూడా చూపించింది. అయినప్పటికీ మైక్రోఫిల్టర్ ఏర్పాటులో ప్రభుత్వం తీవ్ర అలసత్వంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ట్యాంకుపై పెరిగిన మొక్కలు

స్పందించాలని వినతి..

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రక్షిత నీటి పథకం ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయడంతో పాటుగా మైక్రో ఫిల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రస్తుత ఎమ్మెల్యేకు చెప్పినా..

సుపరిపాలనకు మొదటి అడుగు అంటూ ఇటీవల గ్రామానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు గ్రామస్తులు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కరించాలి

గ్రామంలో రక్షిత నీటి పథకం సమస్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ట్యాంకు కూలిపోతే ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోతుంది. యుద్ధ ప్రాతిపదికన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు, ఇతర సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ఎన్ని మార్లు చెప్పినా ఫలితం కనిపించడం లేదు.

– యక్కల మాధవి, సర్పంచి, కప్పలదొడ్డి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

కప్పలదొడ్డి రక్షిత నీటి పథకంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. ఓవర్‌హెడ్ ట్యాంకు, పంప్‌హౌస్, సంప్, పైప్‌లైన్ విస్తరణ తదితర పనులకు రూ.90 లక్షలతో అంచనాలు రూపొందించాం. త్వరలోనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు చేపడ్తాం.

– జి.నాగరాజు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, గూడూరు

పసుపు పంటలో సూక్ష్మధాతు లోపం

శాస్త్రవేత్త కృష్ణవేణి

బొబ్బర్లంక(మోపిదేవి): పసుపు పంటలో సూక్ష్మధాతు లోపాలను గుర్తించినట్లు ఘంటసాల కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి తెలిపారు. మండలంలోని బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, మోపిదేవిలంక గ్రామాల్లో బుధవారం క్షేత్ర స్థాయిలో పలు రకాల పసుపు, కంద, అరటి వంటి వాణిజ్య పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పసుపు పంటలో సూక్ష్మధాతు లోపాలు, జింక్, ఐరన్ లోపాలను గుర్తించామన్నారు. దీని నివారణకు సూక్ష్మధాతు మిశ్రమాన్ని ఐదు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని తెలిపారు. పైపాటుగా 50 కిలోల యూరియా 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 250 కేజీల వేపపిండిని పైపాటుగా వేయాలని చెప్పారు. బొబ్బర్లంక వీఏఏ నారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వంగ, బంతి తోటల పరిశీలన

కొడాలి(ఘంటసాల): వంగ, బంతి తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధికలాభాలు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, జి.కృష్ణవేణి అన్నారు. కొడాలి గ్రామంలో వంగ, బంతి పంటలను బుధవారం పరిశీలించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణిలు మాట్లాడుతూ వంగలో కాండం తొలుచు పురుగును, రసం పీల్చే పురుగులను గమనించినట్లు చెప్పారు. నివారణకు పురుగు ఆశించిన కొమ్మ చివర్లను తుంచివేసి



బొబ్బర్లంకలో అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త కృష్ణవేణి

ప్రొఫినోఫాస్ 2 ఎం.ఎల్. మందును ఒక లీటరు నీటిలో కలిపి పది రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గించడానికి ఫిప్రోనిల్ లేదా మైడితోఎల్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బంతి పంట శాఖీయ దశలో ఉందని, 40వ రోజున ప్రధాన కాండం చివరలను తుంచాలని, దీని వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కొడాలి ఆర్ఎస్‌కే వీఏఏ జేఎన్.చక్రవర్తి, రైతులు పాల్గొన్నారు.

కలుపు తొలగించకపోతే చీడపీడల వ్యాప్తి

చల్లపల్లి: పొలంలో సకాలంలో కలుపు నివారించకపోతే పంటపై చీడపీడలు వ్యాపించే ప్రమాదం ఉందని మండల వ్యవసాయశాఖాధికారి కె.మురళీకృష్ణ సూచించారు. యార్లగడ్డ, వెలివోలు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సకాలంలో కలుపు నివారించకపోతే ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గుతుందన్నారు. వీఏఓ బి.సత్యదేవ్ పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలి

మచిలీపట్నంటౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో ఆక్వా రైతులను, ఆక్వా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మచిలీపట్నంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఏపీ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగినది. ఆక్వా రైతు సంఘ నాయకులు రావి వెంకట్రావు మాట్లాడుతూ ఆక్వా రంగం నుంచి మన రాష్ట్రానికి విదేశీ మారకద్రవ్యం, మార్కెట్ సెస్‌ల రూపంలో కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి



మాట్లాడుతున్న వెంకట్రావు

ఎం హరిబాబు, నాయకులు పుప్పాల నరసింహరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె శివనాగేంద్రం,ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, అజయ్ ఘోష్, సీఐటీయూ నాయకులు బి.సుబ్రమణ్యం, కొడాలి శర్మ, వైన రసింహారావు, ఎం.ఎస్.నారాయణ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట దివ్యాంగుల ఆందోళన

అర్హుల పెన్షన్లు కూడా తొలగించారని ఆవేదన

కోడూరు: అర్హత ఉన్నా తమ పెన్షన్లు తొలగించారంటూ కొందరు దివ్యాంగులు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మండలంలో 13 సచివాలయాల పరిధిలో సుమారు 430 పెన్షన్లను తొలగిస్తూ సంబంధిత పింఛన్‌దారులకు నోటీసులు అందించారు. వీరిలో అనేక మంది దివ్యాంగులు 15,20 సంవత్సరాల నుంచి పెన్షన్లు పొందుతున్నవారే ఉన్నారు. గతంలో 50 నుంచి 80 శాతం వైకల్యం ఉన్నా కూడా ప్రస్తుతం అనర్హత జాబితాలో చేర్చి, వీరికి 40 శాతం లోపు అంగవైకల్యం ఉన్నట్లు పత్రాలు అందించారు. పెన్షన్లు పోయిన వారి నుంచి అర్జీలు తీసుకుంటున్నారే గాని పెన్షన్ ఇస్తారా.. ఇవ్వరా అనే దానిపై అధికారులు సమాధానం ఇవ్వడం లేదని వాపోయారు.

జాబితాలు బయట పెట్టని అధికారులు..

మండలంలో పెన్షన్లు తొలగించిన జాబితాలను మండల పరిషత్ అధికారులు బయటకు రానివ్వకుండా జాగ్రత్త పడ్డారు. కనీసం సచివాలయం వద్ద కూడా ప్రదర్శించలేదు. పెన్షన్లు తొలగించిన వారికి కేవలం నోటీసులు అందించామంటున్నారే కాని అసలు ఎన్ని పెన్షన్లు తొలగించారు, తొలగించిన పెన్షన్ల వివరాలు ఇవ్వాలని పాత్రికేయులు అధికారులను కోరారు. అయితే జాబితా లేదని, సచివాలయ పరిధిలో సుమారు 30 పెన్షన్ల వరకు పోయుంటాయంటూ చెప్పడం గమనార్హం. విమర్శలు వస్తాయనే సాకుతోనే జాబితాను ప్రదర్శించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కోడూరులో పెన్షనర్ల నిరసన

25న కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై సెమినార్

మచిలీపట్నంటౌన్: కార్మికులు, ఉద్యోగుల ముందున్న సవాళ్లు వాటికి పరిష్కారాలపై చర్చించేందుకు ఈనెల 25న స్థానిక శుభం కల్యాణ మండపంలో నిర్వహించే సెమినార్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వై. నరసింహారావు పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా కార్మిక ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కే మధుసూదన్‌రావు స్మారక ఉపన్యాసం సందర్భంగా సీఐటీయూ అఖిలభారత అధ్యక్షురాలు కే హేమలత పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు స్థానిక బుట్టాయిపేట సీఐటీయూ కార్యాలయంలో బుధవారం మచిలీపట్నం మండల విస్తృత సమావేశం జరిగింది. సెప్టెంబర్ 13, 14 తేదీలలో మచిలీపట్నంలో జరగనున్న సీఐటీయూ 12వ జిల్లా మహాసభలు విజయవంతం చేసే కార్యక్రమంపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో డాక్టర్ రావి శ్రీనివాసరావు, ఎల్ఐసీ యూనియన్ జోనల్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు టి.చంద్రపాల్, కృష్ణా జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అంగత రమాదేవి, సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ మచిలీపట్నం కన్వీనర్ చిరువోలు జయరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కోడూరు: కృష్ణానదికి వరద ఉద్ధృతి తొలగే వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉల్లిపాలెం- హంసలదీవి గ్రామాల మధ్య బలహీనంగా ఉన్న కరకట్ట ప్రాంతంలో రక్షణ చర్యలను ఆయన పరిశీలించారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుకబస్తాలు, బాదులతో రక్షణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉల్లిపాలెం అవుట్‌పాల్ స్లూయిజ్ ఎగువ, దిగువ పక్కన రెండు చోట్ల కరకట్ట బలహీనంగా ఉన్నట్లు గుర్తించామని, ఈ ప్రాంతాల్లో తడికెలు, పట్టాలు, ఇసుకబస్తాలతో రక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఇరిగేషన్ డీఈ గణపతి ఎమ్మెల్యేకు వివరించారు. విశ్వనాథపల్లి, పిట్టల్లంక, కోడూరు, ఉల్లిపాలెం అవుట్‌పాల్ స్లూయిస్‌ల నుంచి వరద నీరు పొలాల్లోకి రాకుడా అడ్డుగా ఇసుకబస్తాలు వేసినట్లు చెప్పారు. ఇరిగేషన్ ఏఈ విజయ కుమార్, నీటి సంఘాల అధ్యక్షులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

హడావుడిగా రక్షణ చర్యలు..

వరద ఉద్ధృతి పెరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ వచ్చారు. అయితే బుధవారం ఎమ్మెల్యే కరకట్టను పరిశీలించేందుకు వస్తారనే సమాచారంతో అధికారులు హడావుడిగా పనులు మొదలు పెట్టారు. కరకట్ట బలహీన ప్రాంతాల్లో ఏవిధమైన నాణ్యత లేకుండా హడావుడిగా పనులు చేపట్టారు. కరకట్టకు అనేక ప్రాంతాల్లో కోత ఏర్పడితే కేవలం బుద్ధప్రసాద్ పరిశీలించే చోట మాత్రమే బాదులు, తడికెలు పాతి రక్షణ చర్యలు చేపడుతున్నామంటూ గొప్పలు చెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే పనులను పరిశీలించి వెళ్లిన తరువాత అధికారులు కూడా వెళ్లిపోయారు.



కరకట్ట బలహీన పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్

నాగాయలంక: వరద పరిస్థితి అంచనాకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. వరద పరిస్థితిని పరిశీలించేందుకు ఆయన బుధవారం నాగాయలంకలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్‌ను సందర్శించి వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఘాట్‌లోనే తహసీల్దార్ ఆంజనేయప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, జల వనరుల శాఖ ఇంజినీర్లు, మత్స్యశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, ఉపసర్పంచి తలశిల వెంకట నరసింహారావు(నాని), ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్థిరావు, జిల్లా టీడీపీ మహిళా సెల్ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఇరిగేషన్ డీఈఈ బీబీఎస్ గణపతి, ఏఈఈ పాన్నూరు రవితేజ, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి మల్లికార్జునరావు తదితరుల పాల్గొన్నారు.



పట్టించుకోకుండా వదిలేసిన ఉల్లిపాలెం-హంసలదీవి ప్రాంతంలో కోతకు గురైన కరకట్ట

త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

చల్లపల్లి: మండల పరిధిలోని కొత్తమాజేరు పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా తిరుమలశెట్టి బాలనాగేశ్వరరావు పర్సన్స్‌గా తిరుమలశెట్టి నాగరాజశేఖర్, యార్లగడ్డ శ్రీరామచంద్రమూర్తిలు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, మండలి వెంకట్రామ్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

పెడన: మండల పరిధిలోని నందమూరు శివారు జయంతి కాలనీలో పేకాడుతున్నవారిపై పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. పెడన ఇన్‌చార్జి ఎస్ఐ కే.వి.ఎస్.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ పేకాడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.74366 స్వాధీనం చేసుకున్నామన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

చల్లపల్లి: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి సభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈసభలలో పార్టీ నిర్మాణం , ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చిస్తారన్నారు. రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ జరుగుతుందన్నారు. మూడు వేల మంది జనసేవదళ్ వలంటీర్లతో కవాతు నిర్వహిస్తారని తెలిపారు. జన సేవాదళ్ శిక్షణ తరగతులను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ ప్రారంభించారు. శిక్షణ పొందిన వలంటీర్లు రాష్ట్ర మహాసభల్లో కవాతులో పాల్గొంటారని ఆయన తెలిపారు. పెయ్యల వెంకటేశ్వరరావు సేవాదళ్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు.



జనసేవాదళ్ వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న పెయ్యల వెంకటేశ్వరరావు

వాహనాల సైలెన్సర్లు ధ్వంసం

కోనేరుసెంటర్: నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌లను అమర్చి బైక్‌లు నడుపుతున్న ఆకతాయిలకు చెక్ పెట్టేందుకు బందరు పోలీసులు నడుం బిగించారు. బందరు డీఎస్పీ సీహెచ్ రాజా ఆదేశాల మేరకు బందరు ట్రాఫిక్ సీఐ సున్నరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు గత కొన్ని రోజులుగా నగరంలో బైక్‌లకు సైలెన్సర్‌లను అమర్చి పెద్ద పెద్ద శబ్దాలు చేసుకుంటూ నడుపుతున్న వాహనాలను పట్టుకుంటున్నారు. గడిచిన కొన్ని రోజులుగా 100కి పైగా వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేసిన పోలీసులు బైక్‌లకు అమర్చిన సైలెన్సర్‌లను తొలగించి బుధవారం సుమారు రూ.1.50 లక్షల ఖరీదు చేసే సైలెన్సర్‌లను జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. డీఎస్పీ సీహెచ్ రాజా మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బందరులో 100కి పైగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్‌లను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సైలెన్సర్‌లు మార్చే విషయంలో మెకానిక్‌లపైన కూడా క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.



సైలెన్సర్‌లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

దేవాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రాచీన శివాలయం పునర్నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో శ్రీకాకుళం గ్రామస్తులు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. నేతలు కుంపటి చిట్టిబాబు, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, దాసం రామకృష్ణ, సీతారామరాజు, రావూరి వాసు, బోయిన మణి, కె.కోటి, జి.గణేష్, జి.వెంకటేశ్వరరావు, శ్రీను, సత్య పాల్గొన్నారు.

58 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని కూచిపూడి ఆరోగ్య ఉప కేంద్రంలో అడ్వాన్స్‌డ్ మొబైల్ డయాగ్నస్టిక్ యూనిట్ మొబైల్ బస్ ద్వారా బుధవారం 58 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మొవ్వ పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ సిహెచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మెహనాజ్, రేడియాలజిస్ట్ డాక్టర్ ఎం.బాలచంద్ర, ఎక్స్‌రే టెక్నీషియన్ ఎం.ప్రభాకర్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ జి.రంజిత్‌కుమార్, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొని మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, బ్రెస్ట్ క్యాన్సర్ మొదలైన పరీక్షలు నిర్వహించారు.

పోయినవి

కృష్ణా జిల్లా, కృత్తి వెన్ను మండలం, [illegible] గ్రామానికి చెందిన [illegible] ... T8793321 ... 25-01-2025 ... [illegible]

సంప్రదించండి : 9676357298

పంజాబ్ వెళ్లిన కమిషనర్

మచిలీపట్నంటౌన్: ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పంజాబ్‌లో జరిగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సెమినార్‌కు కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు బుధవారం బయలుదేరి వెళ్లారు. గురువారం నుంచి ఆదివారం వరకు నాలుగు రోజుల పాటు ఈ సెమినార్ జరగనుంది.

థైరాయిడ్‌పై అవగాహన



కొడాలి(ఘంటసాల): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు లాం సామాజిక విజ్ఞాన కళాశాలకు చెందిన విద్యార్థినులు గ్రామీణ అవగాహన పని అనుభవంలో భాగంగా కొడాలి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు థైరాయిడ్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం పోతన లక్ష్మీశ్వరరావు ఆధ్వర్యంలో స్కూల్లోని 8, 9 తరగతి విద్యార్థులకు థైరాయిడ్‌పై చిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.